
www.siddipetpower.com

# సిద్ధిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY



సంపుటి: 02 | సంచిక: 292 | హైదరాబాద్ | ఆదివారం | 15-02-2026 | పేజీలు: 08


## పాలమూరు టూ రాయచూర్



02

రాష్ట్రంలో కొత్తగా ఫోర్ లైన్ హైవే

గూడబెల్లూరు వరకు హైవే

ఎన్‌హెచ్ 167 నాలుగు లైన్లకు గ్రీన్ సిగ్నల్

ప్రధాని మోడీ అధ్యక్షతన కేబినెట్ భేటీ

మూడు ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

అంచనా వ్యయం రూ.18,509 కోట్లు

2030-31 నాటికి పనులు పూర్తి

నిర్మాణంలో లక్షలాది మందికి ఉపాధి

## కాంగ్రెస్ ఓ బ్రోకర్ పార్టీ..

కార్పొరేషన్ ఎన్నికల్లో

కాంగ్రెస్, బీఆర్ఎస్ కు

గట్టిపోటీ ఇచ్చాం

వార్డు సభ్యులు,

కార్పొరేటర్లను ఎత్తుకెళ్తే

తీవ్ర పరిణామాలు

నిజామాబాద్

ఎంపీ ధర్మపురి అర్వింద్

నిజామాబాద్, (సిద్ధిపేట పవర్):

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠంపై సస్పెన్స్ వీడింది. ఇక్కడ 28 డివిజన్లలో విజయం సాధించి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచిన బీజేపీ తాము ప్రతిపక్షంలో ఉంటామని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రకటించారు. ఈ మేరకు ..మిగతా 2లో



## ఎంఐఎం ఆటలు సాగనివ్వం

ఎంఐఎం ప్రాబల్యమున్న

పట్టణాల్లో బీజేపీ బలపడింది

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో

బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తులు

అయినా ప్రజలు బీజేపీనే ఆశీర్వదించారు

మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్, (సిద్దిపేట పవర్):

తెలంగాణలో ఎంఐఎం ఆటలు సాగనివ్వబోమని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఎంఐఎం ప్రాబల్యం ఉన్న నియోజకవర్గాలు, పట్టణాల్లో బీజేపీ బలపడిందన్నారు. ప్రతి ఎన్నికల్లో ఎంఐఎం బలం తగ్గిందన్నారు. త్వరలోనే రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని చెప్పారు. శనివారం హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ..మిగతా 2లో



## ఇది ట్రైలర్ మాత్రమే..

## అసలు సినిమా ముందుంది

ప్రధాన పార్టీలకు సినిమా చూపిస్తాం

మున్సిపల్ ఎన్నికల్లో ట్రైలరే చూపించాం

బీఆర్ఎస్, బీజేపీ పొత్తుకు మున్సిపల్ ఎన్నికలు తొలిమెట్టు

కాంగ్రెస్ తప్పలను ఎత్తిచూపడంలో బీఆర్ఎస్ అట్టర్ ఫ్లాప్

పుర ఫలితాలను బీఆర్ఎస్ సమీక్షించుకోవాలి

90 నుంచి 16 స్థానాలకు పడిపోవడం దారుణం

సీపీఐ అడగకుండానే బీఆర్ఎస్ మద్దతు ప్రకటించడమేంటి..?

కరీంనగర్ కార్పొరేషన్ తప్ప అన్ని చోట్లా బీజేపీ అష్టకష్టాలు

మీడియాతో జాగృతి అధ్యక్షురాలు కవిత

హైదరాబాద్, (సిద్ధిపేట పవర్):

రానున్న రోజులు.. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలకు సినిమా చూపిస్తామని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సవాల్ చేశారు. ఈ నెల 11న విడుదలైన మున్సిపల్ ఎన్నికల్లో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి మద్దతు తెలిపి ఊహించని ఫలితాలతో ట్రైలర్ మాత్రమే చూపించామని చెప్పారు. పుర ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, జాగృతికి చెందిన 40 మంది అభ్యర్థులను ..మిగతా 3లో



# హంగ్‌పై కాంగ్రెస్ ఫోకస్



68 స్థానాల్లో స్పష్టమైన హస్తం స్పష్టమైన ఆధిక్యం

38 చోట్ల ఏ పార్టీకి దక్కని మెజార్టీ

ఆయా స్థానాల్లో కౌన్సిలర్లపై కాంగ్రెస్ ఫోకస్

స్వతంత్రులను తమవైపుకు తిప్పకోనేలా ప్లాన్

అవసరమైతే ఇతర పార్టీ కౌన్సిలర్లను కూడా..

ఆ 38 స్థానాల్లోనూ జెండా పాతాలని నిర్ణయం

మంత్రులకు ముఖ్యమంత్రి

రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

మున్సిపాలిటీల్లో ఆధిపత్యం

ప్రదర్శించాలని సూచనలు

హైదరాబాద్, (సిద్ధిపేట పవర్):

తెలంగాణలో ఇటీవల మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు ముగిసిన తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీకి సరికొత్త సవాలు ఎదురైంది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీల్లో 64 నుంచి 68 వరకు చోట్ల స్పష్టమైన మెజార్టీతో కాంగ్రెస్ విజయం సాధించింది. మొత్తం 2,582 వార్డుల్లో 1,347కి పైగా స్థానాలు గెలుచుకుని హస్తం జెండాను రెపరెపలాడించింది. అయితే, మిగిలిన 38 మున్సిపాలిటీల్లో ఎవరికీ స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో 'హంగ్' పరిస్థితి ఏర్పడింది.

ఈ హంగ్ మున్సిపాలిటీల్లో స్వతంత్ర అభ్యర్థులు (256 వార్డులు గెలిచినవారు) మరియు ఎక్స్‌ఆఫీసియో సభ్యులు కీలక పాత్ర పోషించనున్నారు. ఈ స్థానాలను హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్ నాయకత్వం ప్రత్యేక కసరత్తు మొదలుపెట్టింది. స్వతంత్రులను, ఇతర పార్టీల నుంచి గెలిచిన కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకోవడానికి ప్రత్యేక వ్యూహాలు రూపొందించారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని మల్కాజిగిరి క్యాంపు కార్యాలయంలో ..మిగతా 3లో

## బంగ్లా ప్రధానిగా తారిక్ రెహమాన్...

బంగ్లాదేశ్ ఎన్నికల్లో ఘన విజయంతో ప్రధాని పదవి చేపట్టనున్న తారిక్ రెహమాన్

గతంలో తెరవెనుక రాజకీయాలతో 'డార్క్ ప్రిన్స్'గా పేరు

17 ఏళ్ల పాటు లండన్‌లో అజ్ఞాతవాసం తర్వాత ప్రత్యక్ష రాజకీయాల్లోకి పునరాగమనం

ఆర్థిక వ్యవస్థ, భారత్‌తో సంబంధాలు, శాంతిభద్రతలు ఆయన ముందున్న ప్రధాన సవాళ్లు

తనపై పొగడ్తలు, అనవసర నినాదాలను ఇష్టపడని క్రమశిక్షణ గల నేతగా గుర్తింపు



03

## శివరాత్రికి ముస్తాబైన ప్రముఖ శైవ క్షేత్రాలు

ప్రముఖ శైవ క్షేత్రాల్లో

మహాశివరాత్రి ప్రత్యేక ఏర్పాట్లు

భక్తుల సౌకర్యం కోసం ట్రాఫిక్,


బస్సు సేవలు విస్తృతం

పోలీసు బందోబస్తు,

భద్రతా చర్యలతో ఆంక్షలు

వేములవాడ ఆలయాల్లో

వైభవంగా వేడుకలు



హైదరాబాద్, (సిద్ధిపేట పవర్):

వేములవాడలో మహాశివరాత్రి జాతర వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 16 వరకు జరిగే ఈ ఆధ్యాత్మిక ఉత్సవాల ఏర్పాట్లను ఇన్‌చార్జి ..మిగతా 2లో



ఇక ఆధార్ కార్డుకు

## కొత్త రూపు!

ఆధార్ కార్డుల రూపురేఖలు

మార్చేందుకు యూఐడీఏఐ సన్నాహాలు

దుర్వినియోగాన్ని అరికట్టడమే

లక్ష్యంగా కొత్త డిజైన్ ప్రతిపాదన

కార్డుపై కేవలం ఫోటో,

క్యూఆర్ కోడ్ మాత్రమే ముద్రణ

ఆధార్ నంబర్, పేరు, చిరునామా

వంటి వివరాలు తొలగింపు

ధృవీకరణ ప్రక్రియ ఇకపై

క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారానే

హైదరాబాద్, (సిద్ధిపేట పవర్):

దేశవ్యాప్తంగా కోట్లాది మంది గుర్తింపు కార్డుగా మారిన ఆధార్ కార్డు స్వరూపంలో భారీ మార్పులు రాబోతున్నాయి. ఆధార్ కార్డు ఫోటో కాపీల ద్వారా ..మిగతా 2లో

## బీజేపీ గొప్పలు చెప్పకోవడం సిగ్గుచేటు

మున్సిపల్ ఎన్నికలపై కేటీఆర్ వ్యాఖ్యలు

గత ఎన్నికలతో పోలుస్తూ విమర్శలు

బీఆర్ఎస్‌కు ఫలితాలపై సంతృప్తి

సర్కార్‌పై పోరాటం ఆగదని వెల్లడి

ఫార్ములా ఈ రేస్ కేసుపై కీలక వ్యాఖ్యలు

కేసులు పెట్టినా వెనక్కి తగ్గమని స్పష్టం

హైదరాబాద్, (సిద్దిపేట పవర్):

తెలంగాణలో ఇటీవల ప్రకటించిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. శనివారం మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ శ్రేణులు గట్టిగా పోరాడాయని, అనేక ప్రాంతాల్లో బలమైన పోటీ ఇచ్చామని తెలిపారు. మొత్తంగా 30కి పైగా మున్సిపాలిటీల్లో విజయం సాధిస్తామని అంచనా వేసినట్లు కేటీఆర్ చెప్పారు. అయితే ప్రస్తుతం 17 మున్సిపాలిటీల్లో విజయం దక్కిందని, హంగ్ పరిస్థితి ఉన్న చోట్ల కూడా తమకు అవకాశాలు ..మిగతా 3లో



## కాంగ్రెస్ ఖాతాలోకి నిజామాబాద్ మేయర్ పీఠం

ప్రతిపక్షంలో ఉంటామని

ప్రకటించిన బీజేపీ

కార్పొరేషన్ తమదేనన్న పీసీసీ చీఫ్

కొత్తగూడెం విషయంలోనూ

చర్చిస్తామని ప్రకటన

కాంగ్రెస్‌పై ధర్మపురి

అర్వింద్ విమర్శలు

ఎన్నికల తీరుపై తీవ్ర ఆరోపణలు



02

# ఎంఐఎం ఆటలు సాగనివ్వం

**మొదటిపేజీ తరువాయి**



కార్యాలయంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఎంఐఎం రివైవల్ డే నిర్వహించడంపై మండిపడ్డ ఆయన దేనికోసం రివైవల్ డే చేస్తున్నారని ప్రశ్నించారు. రజాకర్ల రాజ్యం తెస్తారా.. మహిళలను కించపరిచి బతుకమ్మ ఆడిస్తారా.. పాత రాజ్యం తెస్తామని ఎంఐఎం రివైవల్ డే చేస్తుందా? అని నిలదీశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ కాంగ్రెస్‌తో బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తులు పెట్టుకొని బీజేపీని ఓడించాలని కుట్ర పన్నాయన్నారు. అయినా ప్రజలు మాత్రం తమను ఆశీర్వదించారని చెప్పారు. అత్యధిక స్థానాలు చేజెక్కించుకున్న తాము పక్కా ప్లాన్‌తో వ్యూహాత్మకంగా కరీంనగర్ మేయర్ పీఠాన్ని దక్కించుకోబోతున్నామని స్పష్టం చేశారు. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తే.. వారి మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందం బయట పెడతానని తేల్చి చెప్పారు. ఎంఐఎం పార్టీ... ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అనుసంధానకర్తగా పనిచేస్తుందని ఆరోపించారు. కరీంనగర్‌లో కార్యకర్తల కష్టం, ప్రధాని మోదీ ఆశీస్సులతో గెలవడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. స్వతంత్ర అభ్యర్థులు బీజేపీలో చేరారని, మేయర్ పీఠానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ దాటేశామని వెల్లడించారు. మున్సిపల్ పీఠం ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ఇప్పటివరకూ రూ.1,400 కోట్ల పనులు చేశామని తెలిపారు. ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను గెలిపించినందుకు కరీంనగర్ ప్రజలకు బండి కృతజ్ఞతలు చెప్పారు. కాగా రాష్ట్రంలో బీజేపీ గెలుపుపై పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు.

# శివరాత్రికి ముస్తాబైన ప్రముఖ శైవ క్షేత్రాలు

**మొదటిపేజీ తరువాయి**

కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీలు మహేష్ బి. గీతే, రుత్విక్‌సాయిలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్‌లు, చలువ పందిళ్లు, పారిశుధ్యం, జలప్రసాదం , తాత్కాలిక టాయిలెట్ల వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తూ, షిఫ్ట్‌ల వారీగా సిబ్బంది అందుబాటులో ఉండి జాతరను విజయవంతం చేయాలని ఆమె స్పష్టం చేశారు.

మరోవైపు, భక్తుల భద్రత కోసం భీమేశ్వర సదన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఎస్పీ పరిశీలించి, పట్టణవ్యాప్తంగా అమర్చిన సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు స్వామివారిని దర్శించుకునేలా ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు ఆలయ ఈవో రమాదేవి తెలిపారు. బద్ది పోచమ్మ, భీమేశ్వర, కేదారేశ్వర ఆలయాల్లో కూడా పక్కాగా ఏర్పాట్లు చేశామని, పోలీసు యంత్రాంగం నిరంతరం నిఘా ఉంచుతూ భక్తులకు రక్షణ కల్పిస్తుందని అధికారులు వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ శైవ క్షేత్రాలు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివనామస్మరణతో మారుమోగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పంచారామ క్షేత్రాలతో పాటు ప్రముఖ శైవ ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ముఖ్యంగా కోటప్పకొండ, అమరావతి, ద్రైద క్వారీ , గోవాడ వంటి క్షేత్రాల్లో భక్తుల సౌకర్యార్థం అధికారులు ముందెన్నడూ లేని విధంగా అత్యంత భారీ ఏర్పాట్లు చేపట్టారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలో వెలసిన త్రికోటేశ్వర స్వామి క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ ఏడాది శివరాత్రికి సుమారు 3 నుండి 5 లక్షల మంది భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. కోటప్పకొండ ప్రత్యేకత అయిన విద్యుత్ ప్రభలు ఇప్పటికే వివిధ గ్రామాల నుండి కొండకు చేరుకుంటుండటంతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. అయితే శివరాత్రికి ముందే, అంటే శనివారం మధ్యాహ్నం నుండే భక్తుల తాకిడి ఊహించని విధంగా పెరగడంతో కొండకు వెళ్లే ప్రధాన రహదారులన్నీ వాహనాలతో పూర్తిగా నిండిపోయాయి.

లక్షలాదిగా తరలివచ్చే భక్తుల దృష్ట్యా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు కఠినమైన ఆంక్షలు అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో కోటప్పకొండ పైకి ప్రైవేట్ వాహనాల రాకపోకలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. భక్తులు తమ సొంత వాహనాలను కొండ కింద కేటాయించిన నిర్ణీత పార్కింగ్ స్థలాల్లోనే ఉంచాల్సి ఉంటుంది. అక్కడ నుండి భక్తులను కొండపైకి చేరవేసేందుకు ఆర్టీసీ అధికారులు సుమారు 120 ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. భక్తులు కేవలం ఈ ప్రభుత్వ బస్సుల ద్వారా మాత్రమే కొండపైకి చేరుకునేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

భక్తుల భద్రత కోసం సుమారు 3,000 మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచారు. క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉండే భక్తుల కోసం దేవాదాయ శాఖ చలువ పందిళ్లు, తాగునీరు , మజ్జిగ పంపిణీ కేంద్రాలను సిద్ధం చేసింది. అమరావతి అమరలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు ఇతర క్షేత్రాల్లో కూడా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన క్యూ లైన్లను క్రమబద్ధీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ వేడుకలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, భక్తులందరికీ త్వరగా దర్శనం కలిగేలా అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తోంది.



# పాలమూరు టూ రాయచూర్

- **రాష్ట్రంలో కొత్తగా ఫోర్ లైన్ హైవే**
- **గూడబెల్లూరు వరకు హైవే**
- **ఎన్‌హెచ్ 167 నాలుగు లైన్లకు గ్రీన్ సిగ్నల్**
- **ప్రధాని మోడీ అధ్యక్షతన కేబినేట్ భేటీ**
- **మూడు ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం**
- **అంచనా వ్యయం రూ.18,509 కోట్లు**
- **2030-31 నాటికి పనులు పూర్తి**
- **నిర్మాణంలో లక్షలాది మందికి ఉపాధి**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

తెలంగాణ రవాణా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్-పనాజీ ఎకనామిక్ కారిడార్‌లో భాగమైన జాతీయ రహదారి 167ను తెలంగాణలో నాలుగు లైన్ల రహదారిగా విస్తరించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన కేబినేట్ కమిటీ ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

సుమారు 80 కిలోమీటర్ల మేర గుడేబెల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు ఈ విస్తరణ చేపట్టనున్నారు. ఈ మార్గం రాయచూర్, నారాయణపేట, దేవరకద్ర మీదుగా హైదరాబాద్‌కు అనుసంధానం కానుంది. ఇప్పటికే ఉన్న కనెక్టివిటీకి నాలుగు లైన్ల ఆధునిక హైవే జోడించడంతో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడతాయని అధికారులు చెబుతున్నారు.

**ఆర్థికాభివృద్ధికి బలమైన మద్దతు**

ఈ హైవే నిర్మాణంతో తెలంగాణలోని కీలక ఆర్థిక, సామాజిక, లాజిస్టిక్స్ కేంద్రాలకు సులభ రవాణా ఏర్పడనుంది. పరిశ్రమలు, వ్యవసాయం, వాణిజ్య రంగాలకు ఇది పెద్ద ఊతమివ్వనుంది. సరుకు రవాణా వేగవంతమవడంతో ఖర్చులు తగ్గే అవకాశం ఉంది. హైదరాబాద్‌తో దక్షిణ, పశ్చిమ ప్రాంతాల అనుసంధానం మరింత బలపడనుంది. అదే సమావేశంలో ఢిల్లీ, హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో 12 జిల్లాలను కవర్ చేసే మూడు ప్రధాన రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కూడా ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టులతో భారతీయ రైల్వే నెట్‌వర్క్ దాదాపు 389 కిలోమీటర్ల మేర విస్తరించనుంది. మొత్తం అంచనా వ్యయం రూ.18,509 కోట్లు. 203031 నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో కాసారా-మన్మాడ్ 3వ, 4వ లైన్, ఢిల్లీ-అంబాలా 3వ, 4వ లైన్, బల్లారి-హోసపేట 3వ, 4వ లైన్ల అభివృద్ధి ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల నిర్మాణ దశలో సుమారు 265 లక్షల మందికి ఉపాధి కలుగుతుందని అంచనా.

**ప్రయాణ సౌలభ్యం – కార్బన్ ఉద్గారాల తగ్గింపు**

ఈ రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే ప్రయాణ సౌలభ్యం పెరుగుతుంది. సరుకు రవాణా వేగవంతమవడంతో లాజిస్టిక్ ఖర్చులు తగ్గుతాయి. చమురు వినియోగం తగ్గి, కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు కూడా తగ్గుతాయి. దీని ద్వారా స్థిరమైన, సమర్థవంతమైన రైల్వే కార్యకలాపాలకు మద్దతు లభిస్తుంది.



ఈ ప్రాజెక్టులు పీఎం ఘతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ఆధారంగా ప్రణాళిక చేయబడుతున్నాయి. బహుళ రవాణా మార్గాల అనుసంధానం, సమగ్ర ప్రణాళిక, వాటాదారుల సంప్రదింపులతో అమలు చేపడతారు. అస్సాంలో గోహపూర్ నుంచి నుమాలిఘర్ వరకు నాలుగు లైన్ల యాక్సెస్‌కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో బ్రహ్మపుత్ర నది కింద 15.79 కిలోమీటర్ల రోడ్ కమ్‌రైల్ టన్నెల్ నిర్మాణం ఉంది. ఈ ప్రాజెక్ట్‌కు రూ.18,662 కోట్ల వ్యయం అంచనా. ఇది 11 ఆర్థిక కేంద్రాలు, మూడు సామాజిక కేంద్రాలు, రెండు పర్యాటక కేంద్రాలు, ఎనిమిది లాజిస్టిక్స్ కేంద్రాలను అనుసంధానించనుంది. నాలుగు ప్రధాన రైల్వే స్టేషన్లు, రెండు విమానాశ్రయాలు, రెండు జలమార్గాలతో మెరుగైన కనెక్టివిటీ ఏర్పడుతుంది.

**మహారాష్ట్రలో ఎన్‌హెచ్-160ఏ అప్‌గ్రేడ్**

మహారాష్ట్రలో ఎన్‌హెచ్ 160ఏలోని ఘోటి-త్రింబక్-జవహర్-మనోర్-పాల్ఘర్ సెక్షన్‌ను రెండు లేదా నాలుగు లైన్లుగా విస్తరించేందుకు కూడా ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్ట్‌కు రూ.3,320 కోట్లకు పైగా వ్యయం అవుతుంది. ఎన్‌హెచ్ 167 నాలుగు లైన్ల ప్రాజెక్ట్ తెలంగాణకు దీర్ఘకాలంలో భారీ ప్రయోజనం చేకూర్చనుంది. రవాణా వేగవంతమవడంతో పెట్టుబడులు పెరగడం, ఉపాధి అవకాశాలు విస్తరించడం, ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం కావడం వంటి ప్రయోజనాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. మొత్తం మీద కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలు తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా రవాణా మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయనున్నాయి. రాష్ట్ర అభివృద్ధికి ఇవి కీలక మైలురాళ్లుగా నిలిచే అవకాశముంది.

# కాంగ్రెస్ ఖాతాలోకి నిజామాబాద్ మేయర్ పీఠం

- **ప్రతిపక్షంలో ఉంటామని ప్రకటించిన బీజేపీ**
- **కార్పొరేషన్ తమదేనన్న పీసీసీ చీఫ్**
- **కొత్తగూడెం విషయంలోనూ చర్చిస్తామని ప్రకటన**
- **కాంగ్రెస్‌పై ధర్మపురి అర్వింద్ విమర్శలు**
- **ఎన్నికల తీరుపై తీవ్ర ఆరోపణలు**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**



నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠంపై నెలకొన్న సస్పెన్స్ మళ్లీ ముగిసింది. టీపీసీ చీఫ్ *మహేష్ కుమార్ గౌడ్* మీడియాతో మాట్లాడుతూ, నిజామాబాద్ మేయర్ పీఠం తమకే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వివరించారు, నిజామాబాద్‌లో ఎంఐఎం పార్టీ కూడా తమకు మద్దతు ఇస్తుందని, కాబట్టి ఎన్నికల్లో సాయం అందుతుందని అన్నారు. అలాగే కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలోనూ సరైన, చర్చించిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

మహేష్ కుమార్ గౌడ్ సాక్షి మీడియాకు తెలిపినట్లుగా, నిజామాబాద్ మేయర్ పీఠంపై కాంగ్రెస్ నేతే దక్కుతారని ఆయన స్పష్టం చేశారు. సాయంత్రం సీఎం *రేవంత్ రెడ్డి*తో జరిగే సమావేశంలో హంగ్ అయిన మున్సిపాలిటీల అంశంపై వ్యూహ రచన జరుగుతుందని, సీపీఐ నేతలతో చర్చ కొనసాగిస్తామని అన్నారు. జగిత్యాల మున్సిపాలిటీ విషయంలో కూడా కాంగ్రెస్ చైర్మన్‌ను నియమిస్తుందని చెప్పారు. మతానికి సంబంధించిన వివాదాలు వచ్చినా బీజేపీకి వేరే ప్రాధాన్యం లేనని, 90 శాతం గెలుపు రూల్ అంటే ఏమీ లేదని ధీమాగా తెలిపారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ మున్సిపల్ స్థాయిలో ప్రాబల్యం చూపలేనని, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా విజయాన్ని మేమే సాధిస్తామని చెప్పారు. మెగా గ్రేటర్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఆధిపత్యాన్ని కొనసాగిస్తామని ఆయన విశ్వసనీయంగా తెలిపారు.

ఇక, మహేష్ కుమార్ గౌడ్ గతంలో డీసీసీ అధ్యక్షులతో జూమ్ మీటింగ్‌లో కూడా చర్చించారు. గెలిచిన అభ్యర్థులను క్యాంపులకు తరలించే బాధ్యత డీసీసీలకే ఉందని, హంగ్ అయిన మున్సిపాలిటీలలో స్థానిక పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. స్వతంత్ర అభ్యర్థుల మద్దతుపై సాయంత్రానికి మున్సిపాలిటీల వారీగా వివరాలు ఇవ్వాలని డీసీసీలకు ఆదేశాలు జారీ చేశారు. నిజామాబాద్‌లో హంగ్ ఏర్పడిన నేపథ్యంలో ఎంఐఎం పార్టీ కీలకంగా మారనుందని ఈ సమావేశంలో కూడా చర్చ జరిగింది.

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ పీఠం తమకే దక్కుతుందని ధర్మపురి అరవింద్ ప్రకటించినప్పటికీ, 28 డివిజన్లలో బీజేపీ ఎక్కువ స్థానాలు సాధించి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచింది. ధర్మపురి అరవింద్ మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉంటామని ప్రకటించారు. మున్సిపల్ వార్డు సభ్యులు, కార్పొరేటర్లను బలవంతంగా మార్చితే ఆ స్థానాలు బీఆర్ఎస్‌కి లభించి, చివరికి కాంగ్రెస్‌కు వెళ్లిపోతుందని హెచ్చరించారు. ఆయన పేర్కొన్నారు, రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన రాజకీయ స్థితిలో లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలమైన పొజిషన్‌లో లేరని, ప్రజలు ఇప్పటికే రేవంత్ రెడ్డిని విమర్శిస్తున్నారని చెప్పారు.

అరవింద్ తెలిపినట్లుగా, నిజామాబాద్ కార్పొరేషన్‌లో బీజేపీ ఎక్కువ స్థానాలు గెలుచుకున్నప్పటికీ, కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ కంటే బీజేపీ ఆధిక్యం ఎక్కువగా ఉంది. తన పరిధిలోని మిగతా మున్సిపాలిటీలలో కూడా బీఆర్ఎస్ కంటే బీజేపీ ఎక్కువ సీట్లు సాధించిందని తెలిపారు. బీజేపీకి ఓటు ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అయితే, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు లౌకిక రాజకీయ పార్టీ కాకుండా, ఓ బ్రోకర్ పార్టీగా మారిందని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. అరవింద్ ప్రభుత్వంపై కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు. పోలీసులు కాంగ్రెస్ మద్దతు కోసం వ్యతిరేక చర్యలు చేపడుతున్నారని, తన పార్టీ అభ్యర్థులను పోలింగ్ బూత్‌ల నుంచి బయటకు పంపడం వంటి ఘటనలపై కేసులు పెట్టారని, కానీ తనపై కూడా పోలీసులే కేసులు పెట్టారని ఆరోపించారు. ప్రతి కార్పొరేటర్ స్వతంత్రంగా ఎవరికి మద్దతు ఇవ్వాలో నిర్ణయించుకోవాలి, బలవంతంగా ఎత్తుకెళ్తే అది సరైనది కాదని అన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో బండి సంజయ్ సత్తా చాటిన వారియర్ అని, ఆయన అసలైన అర్జునుడి పాత్రకు సరిపోతారని ధర్మపురి అరవింద్ అభినందించారు. ఆయన నేతృత్వంలో కరీంనగర్‌లో బీజేపీ విజయవంతంగా నిలిచిందని తెలిపారు. టీపీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ బీజేపీ, ఎంఐఎం సమీపంలో ఉండకపోవడం, ఆర్మూర్‌లో కొన్ని సీట్లు తక్కువ రావడం వంటి పరిస్థితులపై క్షమాపణలు తెలిపారు. ఎమ్మెల్యేగా ఉండటం వల్ల అక్కడ పూర్తి దృష్టి పెట్టలేకపోయానని చెప్పారు. నిజామాబాద్ మేయర్ పీఠం కాంగ్రెస్‌కి సొంతం అవుతుందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టంగా ధీమా వ్యక్తం చేసినప్పటికీ, మున్సిపల్ ఫలితాలు బీజేపీకి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా గుర్తింపు ఇచ్చింది. ఇది రాష్ట్ర రాజకీయాల్లో కొత్త పరిస్థితులను సృష్టిస్తూ, ప్రతిపక్ష బలాన్ని బలంగా నిలుపుతూ, భవిష్యత్తు ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి అవకాశాన్ని అందిస్తుంది.

# కాంగ్రెస్ ఓ బ్రోకర్ పార్టీ..

**మొదటిపేజీ తరువాయి**



ఇవాళ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ వార్డు సభ్యులు, కార్పొరేటర్లను బలవంతంగా ఎత్తుకెళ్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన ప్రభుత్వమేమి కాదని, సీఎం రేవంత్ రెడ్డి బలమైన పొజిషన్‌లో లేరన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజలు ఛీ కొడుతున్నారని, దానికి తోడు ఇలా కార్పొరేటర్లను ఎత్తుకెళ్తే రాబోయే కాలంలో మరింత ఛీ కొడుతారన్నారు. నిజామాబాద్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ను డామినేట్ చేశామన్నారు. తన పార్లమెంట్ పరిధిలోని మిగతా మున్సిపాలిటీల్లోనూ బీఆర్ఎస్ కంటే ఎక్కువ సీట్లు సాధించామన్నారు. బీజేపీని ఆదరించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు.

**పోలీసులపై నేనే కేసు పెట్టాలి:**


ప్రభుత్వం పోలీస్ శాఖను ఉపయోగించుకుంటోందని పోలీసులు నాపై కేసులు పెట్టడం ఏంటి? నేనే పోలీసులపై కేసు పెట్టాలన్నారు. మా అభ్యర్థులను పోలింగ్ బూత్ లనుండి బయటకు పంపించారని, పోలీసులే కాంగ్రెస్ కు ఓటు వేయాలని చెబుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లను ఎత్తుకెళ్లడానికి కాంగ్రెస్ వారికి సహాయం చేస్తున్నారని పోలీసులు లా అండ్ ఆర్డర్ మెయింటేన్ చేస్తారా లేక బ్రేక్ చేస్తారా అని ప్రశ్నించారు. రాజకీయాలను భ్రష్టుపట్టించారనే కేసీఆర్‌ను ప్రజలు ఓడించారని ఇప్పుడు రేవంత్ రెడ్డి మళ్లీ అదే చేస్తున్నారని దుయ్యబట్టారు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలని కార్పొరేటర్లు ఎవరికి మద్దతు ఇవ్వాలనేది వారి వారి పార్టీలు నిర్ణయించుకుంటాయన్నారు.

**కాంగ్రెస్ ఓ బ్రోకర్ పార్టీ**

బండి సంజయ్ వారియర్ అని ఆయన అర్జునుడి రోల్ కు ఫిట్ అవుతారని స్టీరింగ్ నా చేతిలో ఉన్నంత వరకు ఓకే అంటూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో సత్తాచాటిన బండి సంజయ్ కు అభినందనలు తెలిపారు. బీజేపీ, ఎంఐఎంకు సమ దూరం పాటిస్తామన్న టీపీసీసీ మహేశ్ కుమార్ గౌడ్ పూర్తిగా ఆత్మాభిమానం కొల్పోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆర్మూర్ లో సీట్లు తక్కువ రావడంతో అక్కడి క్యాడర్ కు ఆయన క్షమాపణలు చెప్పారు. ఎమ్మెల్యే ఉండటం వల్ల అక్కడ తాను దృష్టి పెట్టలేకపోయానన్నారు. కాంగ్రెస్ లౌకిక పార్టీ కాదని ఇది ఓ బ్రోకర్ పార్టీ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# ఇక ఆధార్ కార్డుకు కొత్త రూపు!

**మొదటిపేజీ తరువాయి**




జరుగుతున్న మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఈ కీలక మార్పులను ప్రతిపాదించింది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, భౌతిక ఆధార్ కార్డుపై ఇకపై వ్యక్తిగత వివరాలు కనిపించవు.

ప్రస్తుతం మనం బ్యాంకు ఖాతా తెరిచేందుకు, సిమ్ కార్డు కొనుగోలు చేసేందుకు, ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్ కార్డు ఫోటోకాపీలను ఇస్తున్నాం. ఈ కార్డులపై 12 అంకెల ఆధార్ నంబర్‌తో పాటు పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి అత్యంత సున్నితమైన సమాచారం ముద్రించి ఉంటోంది. ఈ ఫోటోకాపీలు నేరగాళ్ల చేతికి చిక్కితే గుర్తింపు చోరీ (ఐడెంటిటీ థెఫ్ట్), ఆర్థిక మోసాలు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉందని యూఐడీఏఐ గుర్తించింది.

ఈ సమస్యను అధిగమించేందుకు, కొత్తగా జారీ చేయబోయే ఆధార్ కార్డులపై కేవలం కార్డుదారుడి ఫోటో, ఒక ప్రత్యేకమైన ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్ మాత్రమే ప్రదర్శించాలని యూఐడీఏఐ యోచిస్తోంది. ఆధార్ నంబర్, చిరునామా వంటి వివరాలన్నీ ఈ క్యూఆర్ కోడ్‌లో భద్రంగా నిక్షిప్తమై ఉంటాయి. గుర్తింపు ధృవీకరణ అవసరమైనప్పుడు, సంబంధిత సంస్థలు తమ వద్ద ఉన్న అధీకృత యాప్‌ల ద్వారా ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాలను సరిచూసుకుంటాయి. దీనివల్ల కేవైసీ ప్రక్రియ వేగవంతం అవ్వడమే కాకుండా, వ్యక్తిగత సమాచారానికి పూర్తి భద్రత లభిస్తుంది.

గత ఏడాది నుంచే ఈ మార్పులపై కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడవచ్చని తెలుస్తోంది. ఆధార్ ఫోటోకాపీల ద్వారా జరిగే దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కొత్త నిబంధనలు తీసుకొస్తున్నామని యూఐడీఏఐ సీఈవో భువనేశ్ కుమార్ ఇటీవలే ఒక సమావేశంలో స్పష్టం చేశారు. ఇటీవల విడుదల చేసిన కొత్త ఆధార్ మొబైల్ యాప్‌లో కూడా లాగిన్ అయిన తర్వాత కేవలం ఫోటో, క్యూఆర్ కోడ్ మాత్రమే కనిపించేలా మార్పులు చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రతిపాదన అమలైతే ఆధార్ గోప్యత మరింత పటిష్ఠం అవుతుందని, మోసాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడుతుందని సాంకేతిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# హంగ్‌పై కాంగ్రెస్ ఫోకస్

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు, పలువురు సీనియర్ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు, తదుపరి కార్యాచరణపై విస్తృత చర్చ జరిగింది.
ప్రధానంగా 38 హంగ్ మున్సిపాలిటీలపై దృష్టి సారించారు. ఈ చోట్ల కౌన్సిలర్లను కాంగ్రెస్ వైపు మళ్లించి, ఎక్కువ స్థానాలు దక్కించుకునేలా మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. స్వతంత్రులతో సంప్రదింపులు, అవసరమైతే రాజకీయ ఒత్తిళ్లు, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అన్ని రకాల వ్యూహాలను అనుసరించాలని సూచించారు.
పార్టీ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం.. ఇప్పటికే గెలిచిన చోట్ల కౌన్సిలర్లు చేజారకుండా కాపాడుకోవడం, హంగ్ ఉన్న చోట్ల ఛైర్మన్, మేయర్ పీఠాలు సాధించడం అన్నీ లక్ష్యంగా పెట్టుకున్నారు. పార్టీ నాయకత్వం అంచనా ప్రకారం 20కి పైగా హంగ్ మున్సిపాలిటీలు కాంగ్రెస్ హస్తగతమవుతాయని ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే కొన్ని చోట్ల స్వతంత్రులతో సానుకూల చర్చలు మొదలయ్యాయని సమాచారం.
ఈ సమావేశం అనంతరం కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయి. "ప్రజలు మరోసారి హస్తం పార్టీపై నమ్మకం చూపారు. హంగ్ చోట్లను కూడా సాధించి, అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ ఆధిపత్యం స్థాపిస్తాం" అని సీఎం రేవంత్ రెడ్డి సమావేశంలో ప్రకటించారు. ఈ విజయాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరింత బలోపేతమవుతుందని నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ సమావేశానికి మంత్రులు కొమ్మరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, సీనియర్ నేతలు జగ్గారెడ్డి, మహమ్మద్ అలీ శాబిర్ వంటి వారు హాజరయ్యారు. తదుపరి కార్యాచరణపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ రూపొందించినట్లు తెలుస్తోంది.



# ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది

**మొదటిపేజీ తరువాయి**

ప్రజలు గెలిపించారన్న ఆమె... తమ లాంటి కొత్త తరహా రాజకీయాల చేసే వారిని ప్రజలు ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు, శనివారం హైదరాబాద్ లోని జూబ్లీ హీల్స్ లోని జాగృతి ప్రధాన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ ఎక్కడ కూడా నిలబెట్టుకోకుండానే మున్సిపల్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుచుకోవడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలు మాకు గుడి కట్టారంటూ చెప్పుకున్న బీఆర్ఎస్... చాలా చోట్ల మూడు, నాలుగు స్థానాలకు పడిపోయిందని చెప్పారు. ఇటు తెలంగాణకు రూపాయి ఇవ్వని బీజేపీ కరీంనగర్ మేయర్ స్థానం తప్ప అన్ని చోట్ల అష్టకష్టాలు పడిందని వ్యాఖ్యానించారు. తాము పార్టీ పెడతామని ప్రకటించగానే బీఆర్ఎస్ నేతలు కారు కూతలు కూస్తున్నారని కవిత ఆరోపించారు. కాంగ్రెస్ తప్పులను ఎత్తి చూపడంలో బీఆర్ఎస్ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని విమర్శించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలు బీఆర్ఎస్, బీజేపీ పొత్తుకు తొలిమెట్టు అన్నారు. ఈ ఎన్నికల్లో ఆయా పార్టీలు రహస్య ఒప్పందంతో పోటీ చేశాయని ఆరోపించారు. కాంగ్రెస్ అపొజిషన్ లో ఉన్నప్పుడు వచ్చిన ఫలితాలతో బీఆర్ఎస్ ఈ ఎన్నికల ఫలితాలను పోల్చుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో 90 శాతం మున్సిపాలిటీల్లో గెలిస్తే ఇప్పుడు 16 స్థానాలకే పరిమితం అయిన విషయాన్ని గ్రహించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రజల ప్రేమను ఎందుకు కోల్పోయారో సమీక్షించుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ ఎన్నిక విషయంలో సీపీఐ అడగకుండానే బీఆర్ఎస్ మద్దతు ప్రకటించడం దారుణమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాంబశివ రావు కేసీఆర్ పై చేసిన ఆరోపణలను ఆమోదిస్తున్నారా? అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తో మిలాఖత్ అయిన సీపీఐ కి మద్దతివ్వటమంటే నయవంచనే అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అప్రమత్తంగా లేకపోవడంతోనే ప్రజలు కాంగ్రెస్ కు ఓటు వేశారని ఆరోపించారు. ఉద్యమకారులను మంచి చేయాలని మాట్లాడిన తన గురించి ఇష్టమొచ్చినట్లు గా మాట్లాడుతున్నారని కవిత ఆరోపించారు. ఈ అహంకారం తగ్గించుకొని ప్రజల మధ్యలో ఉండకపోతే ఇలాంటి ఫలితాలే వస్తాయని చురకలంటించారు. మరో పదిన్నరేళ్లు నేనే ముఖ్యమంత్రిగా ఉంటా నాకు ఆరు నెలలు బోనస్ కూడా వస్తది అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి... ముందు రైతులకు ఇచ్చే బోనస్ గురించి మాట్లాడాలని కవిత డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా కేంద్రం వచ్చే బడ్జెట్ లో నిధులు



కేటాయించాలని డిమాండ్ చేశారు.

**న్యూ ప్లేయర్ ను ప్రజలు ఆదరించారు.**

తాము త్వరలోనే రాజకీయ పార్టీగా మారబోతున్నామని చెప్పి ఎన్నికల్లో పోటీ చేశామన్న కవిత... సమయం తక్కువగా ఉన్నప్పటికీ కార్యకర్తల ఒత్తిడి మేరకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తో కలిసి పోటీ చేసినట్లు వివరించారు. అయినా ప్రజలు తమను 40 స్థానాల్లో గెలిపించారని చెప్పారు. అధికారికంగా 33 స్థానాలు అయినప్పటికీ కొంతమందికి భీ ఫామ్ ఇవ్వటంలో ఇబ్బంది అయ్యిందనీ అలా మరో ఏడు స్థానాల్లో తాము మద్దతు తెలిపిన అభ్యర్థులే గెలిచారన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డెపల్లి మున్సిపాలిటీలో తమకు క్లియర్ మాన్ డేట్ ను ప్రజలు కట్టబెట్టారని చెప్పారు. కానీ కాంగ్రెస్ నేతలు తమ ప్రలోభాలతో వారిని లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఛైర్మన్ ఎన్నిక వరకు ఏమీ జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. అందుకే దాని గురించి మాట్లాడటం లేదని వ్యాఖ్యానించారు. అలాగే నారాయణ్ పేట మున్సిపాలిటీలోనూ తమకు వైస్ ఛైర్మన్ పదవి ఆఫర్ చేస్తున్నట్లు కవిత వెల్లడించారు. దీనిపై నిర్ణయం స్థానిక నాయకులకే అప్పగించామని చెప్పారు.

# బీజేపీ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు

**మొదటిపేజీ తరువాయి**



ఉన్నాయని పేర్కొన్నారు. ఫలితాలు పూర్తిగా విశ్లేషిస్తే బీఆర్ఎస్ ప్రదర్శన సంతృప్తికరంగా ఉందన్నారు.
బీజేపీ తన ప్రదర్శనపై గొప్పలు చెప్పుకోవడం అర్థం కావడం లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీకి తక్కువ ఓట్లు, తక్కువ వార్డులు వచ్చాయని అన్నారు. జాతీయ స్థాయి నాయకులను తీసుకొచ్చి విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ, ఒక్క మున్సిపాలిటీ కూడా గెలవలేకపోయారని విమర్శించారు. ముఖ్యమంత్రి, జాతీయ అధ్యక్షుడు ప్రచారంలో పాల్గొన్నా ఫలితాల్లో మార్పు రాలేదన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానిక అంశాలే ప్రధాన పాత్ర పోషిస్తాయని కేటీఆర్ అన్నారు. అధికారంలో ఉన్న పార్టీకే సాధారణంగా కొంత మద్దతు ఉంటుందని చెప్పారు. అయినప్పటికీ తమ పార్టీ కార్యకర్తలు బలమైన పోరాటం చేశారని పేర్కొన్నారు.
ఈ ఎన్నికల్లో డబ్బు ప్రభావం ఎక్కువగా కనిపించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ విస్తృతంగా ఖర్చు చేసిందని అన్నారు. ఫలితాలు అనుకూలంగా రాని జిల్లాల్లో కూడా పార్టీ శ్రేణులు ధైర్యంగా పోరాడినట్లు చెప్పారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల రెండింట్లోనూ బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చిందన్నారు.ఎక్స్ అఫీషియో సభ్యుల విషయంలో ప్రభుత్వానికి స్పష్టత లేదని కేటీఆర్ ఆరోపించారు. కలెక్టర్లు ఒక మాట, చీఫ్ సెక్రటరీ మరో మాట చెబుతున్నారని అన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలపై స్పష్టత లేకపోవడం వల్ల అనవసర వివాదాలు వస్తున్నాయని తెలిపారు.

**ఫార్ములా ఈ అంశంపై స్పందన**

ఫార్ములా ఈ రేస్ అంశాన్ని ప్రభుత్వం మళ్లీ తెరపైకి తెస్తోందని కేటీఆర్ చెప్పారు. ఇప్పటికే పలుమార్లు విచారణకు పిలిచారని, మరోసారి పిలిచినా హాజరవుతామని తెలిపారు. తాము చేసిన పని సత్యసంధంగా ఉందని, ఎలాంటి భయం లేదని ధీమా వ్యక్తం చేశారు.ఎన్నిసార్లు విచారణ చేసినా నిజం మారదన్నారు. చివరికి జైలుకు పంపినా వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులే కేసులో బలం లేదని చెప్పినట్లు తెలిపారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎంత గెలిచిందో ప్రజలు గుర్తుంచుకోవాలని కేటీఆర్ అన్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తక్కువ స్థానాలే సాధించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం తమ పార్టీ సాధించిన ఫలితాలను ప్రజలు తులనాత్మకంగా చూస్తున్నారని చెప్పారు.

**ముందున్న రాజకీయ పోరాటం**

ఈ ఫలితాలు భవిష్యత్తు రాజకీయాలకు సంకేతమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల మద్దతు తమ పార్టీకి ఉందని, వచ్చే ఎన్నికల్లో మరింత బలంగా ముందుకు వస్తామని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తాయని తెలిపారు.మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్గాలు సానుకూలంగా స్పందిస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై విమర్శలు చేస్తూనే తమ ప్రదర్శనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో ఈ ఫలితాలు కొత్త చర్చలకు దారి తీసే అవకాశముంది.

# బంగ్లా ప్రధానిగా తారిక్ రెహమాన్...

- **బంగ్లాదేశ్ ఎన్నికల్లో ఘన విజయంతో ప్రధాని పదవి చేపట్టనున్న తారిక్ రెహమాన్**
- **గతంలో తెరవెనుక రాజకీయాలతో 'డార్క్ ప్రిన్స్'గా పేరు**
- **17 ఏళ్ల పాటు లండన్‌లో అజ్ఞాతవాసం తర్వాత ప్రత్యక్ష రాజకీయాల్లోకి పునరాగమనం**
- **ఆర్థిక వ్యవస్థ, భారత్‌తో సంబంధాలు, శాంతిభద్రతలు ఆయన ముందున్న ప్రధాన సవాళ్లు**
- **తనపై పొగడ్తలు, అనవసర నినాదాలను ఇష్టపడని క్రమశిక్షణ గల నేతగా గుర్తింపు**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**



బంగ్లాదేశ్‌లో ఇటీవలి ఎన్నికల ఫలితాలు రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేశాయి. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్ పీ) చారిత్రాత్మక విజయం సాధించడంతో, పార్టీ ఛైర్మన్ తారిక్ రెహమాన్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమైంది. సుమారు 17 ఏళ్ల పాటు దేశానికి దూరంగా, అజ్ఞాతవాసంలో ఉన్న ఆయన ఇప్పుడు ఒక్కసారిగా అధికార పీఠాన్ని అధిరోహించనుండటంతో, ఆయన వ్యక్తిత్వం, రాజకీయ ప్రస్థానంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గతంలో ఎక్కువగా తెరవెనుక కార్యకలాపాలకే పరిమితమైన ఆయన గురించి తెలుసుకోవాలన్న కుతూహలం ప్రజల్లో పెరిగింది.
సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొన్ని వీడియో క్లిప్పులు ఆయన భిన్నమైన వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఒక వీడియోలో, తనను పదేపదే పొగడొద్దని, అది తనకు నచ్చదని అనుచరులకు ఆయన స్పష్టం చేశారు. మరో సందర్భంలో, కొత్తగా పార్టీలో చేరిన కొందరు నినాదాలు చేస్తుండగా వారిని మందలించారు. పార్టీలోని పాత తరం కార్యకర్తల నుంచి మార్గదర్శకత్వం తీసుకోవాలని సూచించారు. ఇంకో ఘటనలో, ఆయన ప్రయాణిస్తున్న కాన్వాయ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగింది. అక్కడ విధుల్లో ఉన్న పోలీస్ అధికారి ముందుకు వెళ్లమని సూచించినా, ఆయన నిరాకరించి సిగ్నల్ పడే వరకు ఆగడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ పరిణామాలు ఆయన క్రమశిక్షణ, నిబంధనల పట్ల గౌరవాన్ని సూచిస్తున్నాయి.
మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహమాన్, మాజీ ప్రధాని ఖలీదా జియాల పెద్ద కుమారుడైన 60 ఏళ్ల తారిక్ రెహమాన్‌పై ప్రజల్లో తీవ్ర ఆసక్తి ఉంది. 1990లు, 2000ల ప్రారంభంలో పార్టీలో వేగంగా ఎదుగుతూ, తెరవెనుక శక్తివంతమైన నేతగా మారారు. అయితే, స్వదేశంలో పెరిగిన రాజకీయ ఒత్తిళ్లు, పలు కేసుల కారణంగా ఆయన సుమారు 17 సంవత్సరాలు లండన్‌లో ప్రవాస జీవితం గడపాల్సి వచ్చింది. అయినప్పటికీ, అక్కడి నుంచే పార్టీ వ్యూహాలను నిర్దేశిస్తూ, కేడర్‌పై తన పట్టును నిలుపుకున్నారు. ఎన్నికల్లో పార్టీ అద్భుత విజయం సాధించడంతో, ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి నాటకీయంగా పునరాగమనం చేశారు.
ఎక్కువగా తెరవెనుక ఉండటానికే ఇష్టపడటంతో ఆయనకు 'డార్క్ ప్రిన్స్' అనే పేరు స్థిరపడింది. బంగ్లాదేశ్‌లో ఆయనపై అనేక క్రిమినల్ కేసులు, శిక్షలు ఉన్నాయి. అయితే, ఇవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని ఆయన మద్దతుదారులు వాదిస్తుండగా, అవి ఆయన అవినీతి, అధికార దుర్వినియోగానికి నిదర్శనమని విమర్శకులు ఆరోపిస్తున్నారు. ఈ న్యాయపోరాటాలే ఆయన ప్రవాస జీవితానికి కారణమయ్యాయి.
కొందరు ఆయన్ను పార్టీకి పునరుజ్జీవం పోయగల నిర్ణయాత్మక నాయకుడిగా చూస్తుంటే, మరికొందరు వారసత్వ రాజకీయ నేతగా విమర్శిస్తున్నారు. ఆయన రాకతో దేశంలో మళ్లీ రాజకీయ ధ్రువీకరణ పెరుగుతుందనే ఆందోళనలు కూడా ఉన్నాయి. ఆయన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే రాజకీయ స్థిరత్వం, దౌత్య సంబంధాల పునఃసమీక్ష, ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడం, మతతత్వ శక్తుల ఒత్తిడిని నియంత్రించడం, శాంతిభద్రతలను పునరుద్ధరించడం వంటి క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సమర్థవంతమైన కేబినెట్‌ను ఏర్పాటు చేయడం, పార్టీ అంతర్గత విభేదాలను పరిష్కరించడం, అందరినీ కలుపుకొనిపోయే పాలన అందిస్తామని ప్రజలకు భరోసా ఇవ్వడం తక్షణ కర్తవ్యాలుగా మారాయి. అన్నింటికన్నా ముఖ్యంగా, పొరుగు దేశమైన భారత్‌తో దౌత్య సంబంధాలను తిరిగి బలోపేతం చేసుకోవడం అత్యవసరం. బంగ్లాదేశ్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని భారత్ ఇప్పటికే సంకేతాలు పంపింది. అయితే, ప్రవాసంలో ఉన్న రాజకీయ నేతల భవిష్యత్తు, పాకిస్థాన్‌తో సంబంధాల వంటి సున్నితమైన అంశాలపై ఢాకా వైఖరిని భారత్ జాగ్రత్తగా గమనిస్తుంది. మరోవైపు, గత తాత్కాలిక ప్రభుత్వం పాకిస్థాన్, చైనాలతో పెంచుకున్న సంబంధాల ఒత్తిడిని కూడా కొత్త ప్రభుత్వం ఎదుర్కోవాల్సి ఉంటుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న వస్త్ర పరిశ్రమ తీవ్రమైన పోటీని ఎదుర్కొంటోంది. అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం కొంత ఉపశమనం కలిగించవచ్చని అంచనా. కానీ, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. యూఎస్ఏఐడీ సహాయం ఉపసంహరించుకోవడంతో ఆరోగ్య రంగంపై కూడా ఒత్తిడి పెరిగింది. మరోవైపు, 2024లో జరిగిన అల్లర్ల తర్వాత అవామీ లీగ్ కార్యకర్తలపై దాడులు, హిందువుల హత్యలతో శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ పరిణామాలు దేశ పోలీస్ వ్యవస్థలో నైతిక స్థైర్యాన్ని దెబ్బతీశాయి. మొత్తంగా, 'నీడల యువరాజు'గా ఉన్న తారిక్ రెహమాన్ ఇప్పుడు వెలుగులోకి వచ్చారు. ఆయన ముందున్న మార్గం సుదీర్ఘమైనది, అత్యంత కఠినమైనది అనడంలో సందేహం లేదు.

# మహాశివరాత్రి వేడుకలకు సూరారం పోలీసుల కట్టుదిట్టమైన బందోబస్తు

- **సూరారం ఉమామహేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై పోలీసుల సమీక్ష**

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 14(సిద్దిపేట పవర్):**

సూరారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని సూరారం ఉమామహేశ్వర దేవాలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పోలీసులు పరిశీలించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశముండటంతో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.ఈ సందర్భంగా సూరారం పోలీస్ స్టేషన్ పరిధి ఎస్ఐలు మురళి గౌడ్, కృష్ణ, కిషన్ నాయక్ ఆలయ వ్యవస్థాపకులు ముద్దాపురం మదన్ గౌడ్, మరియు కమిటీ సభ్యులతో కలిసి దేవాలయం ప్రాంగణాన్ని పరిశీలించారు. భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రాత్రి జాగరణ, ప్రత్యేక పూజలు, అభిషేకాల సందర్భంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, క్యూలైన్ల ఏర్పాటు, పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా, ఆలయ పరిసరాల్లో విక్రయ స్టాళ్లను క్రమబద్ధంగా ఏర్పాటు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సదుపాయం సిద్ధంగా ఉంచాలని కమిటీకి సూచించారు. భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ పండుగను ప్రశాంతంగా జరుపుకోwవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. మహాశివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో,ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరగాలని పోలీసులు,ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.









# సంత్ సేవాలాల్ దేశం గర్వించదగ్గ ఆధ్యాత్మిక వేత్త

- **ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు**
- **ముఖ్యఅతిథిగా పిసిసి వైస్ ప్రెసిడెంట్ డా.కోట నీలిమ**

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 14 ( సిద్దిపేట పవర్ ):** సంత్ సేవాలాల్ మహరాజ్ దేశం గర్వించదగ్గ ఆధ్యాత్మికవేత్త అని, సమాజానికి ఆయన అందించిన సేవలు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయని పీసీసీ వైస్ ప్రెసిడెంట్ డా.కోట నీలిమ అన్నారు.హైదరాబాద్ ఎస్ఆర్ నగర్ డివిజన్ బాపునగర్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.రవి కిరణ్, బాలు నాయక్, తరుణ్ జాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో అమీర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.ఎస్. రావు, శ్రీకాంత్ యాదవ్, పద్మావతి, పింకీ భాయ్, మదన్ సింగ్, ప్రతాప్ నాయక్, కృష్ణ కుమార్, అర్పాట్, మహేష్, వినోద్, అనిత, రాజేష్, సునీత తదితరులు పాల్గొన్నారు.

# పుల్వామా దాడి వీర జవాన్లకు ఘన నివాళులు

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 14 ( సిద్దిపేట పవర్ ):** దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పుల్వామా దాడి వీర జవాన్లను స్మరించుకుంటూ ఫిబ్రవరి 14 సందర్భంగా శనివారం నిజాంపేటలో ఘనంగా నివాళుల కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీర జవాన్ల త్యాగాలను స్మరించుకున్నారు.జాతీయ జెండాలు చేతబట్టి దేశభక్తిని చాటుతూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్నవారు దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా నిజాంపేట్ అధ్యక్షులు పి. వెంకటేశ్వర్ ముదిరాజ్‌తో పాటు పలువురు స్థానికులు, యువకులు, దేశభక్తులు పాల్గొని వీర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు.



# పురాతన ఆలయం..జాతరకు ముస్తాబు

- **తిగుల్ లో మహాశివరాతి ఉత్సవాలకు పార్వతి పరమేశ్వర ఆలయం సిద్ధం**
- **మూడు రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు**
- **సోమవారం అగ్నిగుండాలు, కల్యాణోత్సవం**
- **బండ్ల ఊరేగింపు, భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి**
- **ఆలయ పూజారి రాజు**
- **గ్రామ సర్పంచ్ రజిత**





**సిద్దిపేట పవర్ గజ్వేల్ ప్రతినిధి:** జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో గల పురాతన పార్వతి పరమేశ్వర ఆలయం మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు ముస్తాబయింది. ఆలయ నిర్వాహకులు ఆలయానికి రంగులు వేసి జాతర సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయం ముందున్న కోనేరు చుట్టూ ఉన్న ముళ్లపొదలను తొలగించి బాగు చేశారు. అలాగే హనుమాన్ ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. భక్తులకు జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సునయాసంగా దర్శించుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ రజిత ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చే దారిలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. అలాగే బండ్ల ఊరేగింపుకొచ్చే బాటలో మొరం పోసి బాగు చేశారు. ఆదివారం నుండి ప్రారంభ ప్రారంభమై ఉత్సవాలు మంగళవారం ముగుస్తాయి సోమవారం అమ్మవారి కళ్యాణోత్సవం అగ్నిగుండాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. తిగుల్ గ్రామంలో జరిగే మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు చుట్టుముట్ట గ్రామాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే ఓడిబియ్యం పోసేందుకు పోటి పడతారు. ఆలయం ముందున్న శివుడి భారీ విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

**కార్యక్రమాల వివరాలు...**

మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం ఆలయంలో ఉదయం నుంచే అభిషేకాలు ప్రారంభం, 15న సాయంత్రం దేవుడి ఎదురుకొల్లు, ఊర్లో దండకలు వేయడం. చీర వేయుట, సోమవారం తెల్లవారుజామున పార్వతి పరమేశ్వర కళ్యాణోత్సవం, కళ్యాణం అనంతరం వీరభద్ర ప్రస్తాయం. అమ్మవారికి బలి ప్రధానం, ఆలయం ముందు అగ్ని గుండాలు ప్రవేశం, వీరభద్ర విజయం, ఉదయం తొమ్మిది గంటలకు అమ్మ ఒడిబియ్యం పోయుట, సాయంత్రం ఊరేగింపు, అమ్మవారికి వేయుట సాయంత్రం బండ్ల ఊరేగింపు, అమ్మ వారికి చీర వేయుట, అలాగే నంది వాహన సేవ, రాత్రి భాగవతం తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.



**జాతరకు ఏర్పాట్లు పూర్తి, పూజారి రాజు...**

మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో మూడు రోజుల పాటు ఘనంగా జాతర ఉత్సవాలు జరుగుతాయి. జాతర ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేసినం. కళ్యాణో త్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం.

**భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు..**

**సర్పంచ్ రజిత..**

మహాశివరాత్రి సందర్భంగా తిగుల్ గ్రామంలో పురాతన ఆలయమైన పార్వతి పరమేశ్వర ఆలయం మూడు రోజుల జాతర ఉత్సవాలకు ముస్తాబయింది. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవడం జరిగింది. ఆలయం సమీపంలో రోడ్డును బాగు చేయడం, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడం అపరిశుభ్రత లేకుండా పరిశుభ్రత చర్యలు చేపట్టినం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరిగింది. జాతర ఉత్సవాలకు గ్రామ ప్రజలంతా సహకరించాలి.

# మున్సిపల్ ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీతో కాంగ్రెస్ గెలుపు!!

- **మాజీ మంత్రి తలసాని**

**సిద్దిపేట పవర్**

మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ పలు దౌర్జన్యాలకు పాల్పడిందని, డబ్బులు, మద్యం ఏరులై పారించిందని మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.



సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులు మీద పుట్టి అన్ని దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అధికారం నడిపిస్తుందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో గుడ్డిలో మెల్లలాగా కాంగ్రెస్ గెలిచిందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేసి గెలుపొందారని కొనియాడారు.

రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వాలు ఎపుడు కూడా శాశ్వతం కాదు. ప్రజలు శాశ్వతం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కి సరైన గుణపాఠం చెబుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఎక్కడ ఒక్క ప్రాజెక్ట్ నిర్మించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఫ్రీ టికెట్ పెట్టి పురుషులకు డబుల్ రెట్లు పెంచారని ఆరోపించారు.

కేసీఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు చూశారని, రాష్ట్రం సాధించడం ఒక్క అద్భుతమైన ఘట్టమని, తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్ట్ లు నిర్మించారని తెలిపారు. గతంలో నీరు, విద్యుత్ లేక రైతులు ఇబ్బంది పడ్డారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడితే కేసీఆర్ పంట సహాయం చేశారని గుర్తు చేశారు.

తాను టీడీపీ లో ఉన్నపుడు 5గంటలకు మించి విద్యుత్ రాకపోయేదని వివరించారు. రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ ప్రభుత్వంలో కుదేలయింది ని, కేసీఆర్ హయాంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటితే కాంగ్రెస్ హయాంలో భూముల ధరలు పడిపోయాయని అన్నారు. సిద్దిపేటను హరీష్ రావు బాగా అభివృద్ధి చేశారని ప్రశంసించారు.

# పరమశివుని అనుగ్రహం తో అన్నింటా శుభం జరగాలి...

- **మహా శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు...**
- **మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.**



నేడు మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రజలందరికి మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీష్ రావు మహా శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పర్వదినాన్ని ప్రజలంతా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆ పరమేశ్వరుని అనుగ్రహముతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని.. అన్నింటా శుభం చేకూరాలన్నారు. మహా శివరాత్రి రోజున స్వామి వారి ఉపవాస దీక్ష లో ప్రజలందరూ భక్తితో స్వామిని కొలిచి మీ కోర్కెలు నెరవేరాలి అని.. ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాని కోరుకున్నారు

# గాంధీ ఆవరణలోని నిరాశ్రయులను అనాధాశ్రమానికి తరలించిన పోలీసులు

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 14 (సిద్దిపేట పవర్ )::** సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో నిరాశ్రయులు, వృద్ధుల కోసం చిలకలగూడ పోలీసులు శనివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురిని సంచార జాతులకు చెందిన యాచకులుగా గుర్తించి ప్రత్యేక వాహనంలో వారిని అనాధాశ్రమానికి తరలించారు. ఏసీపీ శశాంక్ రెడ్డి, ఎస్సై ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. వివిధ అనారోగ్య కారణాలతో ఎవరి పట్టింపుకు నోచుకోక గత కొంతకాలంగా గాంధీ ఆవరణలో నిత్యం అనాధలు, యాచకులు మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు స్పందించి యాచకులను గుర్తించి, వారిని వరుసగా అనాధాశ్రమాలకు తరలిస్తున్నారు. దీనిపై పోలీసుల స్పందన ను పలువురు అభినందిస్తున్నారు.



# గాంధీ ఆసుపత్రిలో గ్రూప్–1 అధికారుల అధ్యయన పర్యటన

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 14 (సిద్దిపేట పవర్ ):** సికింద్రాబాద్‌లోని గాంధీ హాస్పిటల్ లో తమ శిక్షణ కార్యక్రమంలో భాగంగా 134 మంది గ్రూప్-1 అధికారులు శనివారం అధ్యయన పర్యటన నిర్వహించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను అధికారులు సందర్శించి వైద్య సేవల నిర్వహణ విధానాలను తెలుసుకున్నారు. గాంధీలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఇక్కడ లభ్యమయ్యే వైద్య సౌకర్యాలు,వసతి,ఓపీ విభాగంలో పేషంట్లు,క్రిటికల్ కేర్ సర్వీసులు, మాతా శిశు సంరక్షణ కేంద్రం ,తదితర అంశాలపై అధ్యయనం చేశారు. గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. వాణి, ఆర్ఎంవో లు డా.కళ్యాణ్ చక్రవర్తి,డా.రజని,డా.యోగేందర్,వివిధ విభాగాల వైద్యాధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

